
సాక్షి
బాపట్ల
సోమవారం । 18 । నవంబర్ । 2024



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 8545 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 8545 క్యూసెక్కులు వదిలారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 585.00 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 9,900 క్యూసెక్కులు వదిలారు.

దుర్గమ్మకు బంగారు కాసుల పేరు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు విజయవాడకు చెందిన భక్తులు ఆదివారం బంగారు కాసుల పేరును కానుకగా సమర్పించారు. గొల్లపూడికి చెందిన ఎ.సూరిబాబు కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసి కానుక అందజేశారు.

న్యూస్‌రీల్

విగ్రహ ప్రతిష్టలో హైకోర్టు జడ్జి దంపతులు



పర్చూరు (చినగంజాం): మండలంలోని అన్నంబొట్లవారిపాలెంలో నూతనంగా నిర్మించిన గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం ఆదివారం అంగరంగవైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి వేలాది మంది భక్తులు తరలి రావడంతో గ్రామంలో పండుగ వాతావరణ నెలకొంది. స్వామి వారి విగ్రహాలతోపాటు ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ట కూడా నిర్వహించడంతో భక్తులతో ఆలయం కిక్కిరిసి పోయింది. ఆలయంలోకి వచ్చిన మహిళా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అందరికీ అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి కే సురేష్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. చిలకలూరిపేట జూనియర్ సివిల్ జడ్జి కే నరేంద్రరెడ్డి, చీరాల జూనియర్ సివిల్ జడ్జి నిషాద్ నాంచ్, హిందూ ధార్మిక పరిషత్ అధ్యక్షులు బూచేపల్లి సత్యనారాయణ, ఆయన సతీమణి లలితాంబ, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి మండల స్థాయిలోనూ పీజీఆర్ఎస్

బాపట్లటౌన్: సోమవారం నుంచి మండల, మున్సిపల్ స్థాయిలోనూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటమురళి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి సమీప మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తులు అందజేయాలన్నారు.

పవర్ లిఫ్టర్లు ఎంపిక



మంగళగిరి: ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రంలోని సేలంలో జరిగే సౌత్ ఇండియా సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ మెన్, ఉమెన్ ఎక్యూప్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు గుంటూరు జిల్లా నుంచి 13 మంది పవర్ లిఫ్టర్లు ఎంపికైనట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్మాకుల విజయభాస్కరరావు, కార్యదర్శి సంధాని తెలిపారు. ఆదివారం కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. ఎంపికైన పవర్ లిఫ్టర్లు 43 కేజీల విభాగంలో శ్రావణి, 84 కేజీల విభాగంలో లక్ష్మీ వినయశ్రీ, 63 కేజీల విభాగంలో పి.అంజలి, 47 కేజీల విభాగంలో ఎం షనూన్, 84 కేజీల విభాగంలో ఎస్‌కే షబీనా, 76 కేజీల విభాగంలో చతుర్య, 76 కేజీల విభాగంలో బి చంద్రిక, 74 కేజీల విభాగంలో హేమవర్ధన్, 93 కేజీల విభాగంలో నాగగణేష్, 76 కేజీల విభాగంలో రమేష్ శర్మ, 105 కేజీల విభాగంలో పృధ్వీ, 93 కేజీల విభాగంలో ఎస్ కౌశిక్, 59 కేజీల విభాగంలో భరత్‌కుమార్‌లు ఎంపికైనట్లు తెలిపారు.

వేణుగోపాలస్వామికి లక్ష తులసి దళార్చన



చేబ్రోలు : వేజెండ్ల గ్రామంలోని వేణుగోపాల స్వామి దేవస్థానంలో ఆదివారం లక్ష తులసి దళార్చన వైభవంగా జరిగింది. కార్తిక మాస పర్వదినాలను పురస్కరించుకుని లోక హితార్థం లక్ష తులసి పూజా కార్యక్రమం పండితులు నిర్వహించారు. వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం ఉదయం సుప్రభాత సేవ, అనంతరం స్వామికి పంచామృత అభిషేకం చేశారు. తర్వాత ప్రత్యేక అలంకరణలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. విశ్వక్సేన ఆరాధన మండపారాధన పుణ్యాహవచనం అజస్త్ర దీపారాధన, లక్ష్మీనారాయణ యజ్ఞం జరిగాయి. రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామికి పంచామృత అభిషేకం అనంతరం అష్టోత్తర కలశాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అర్చకులు మాల్యవంతం రాఘవ కుమార్ పర్యవేక్షణలో శాంతి కళ్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది.

సమన్యాయం హుష్ ఖాకీ

కిందిస్థాయి సిబ్బందే బలి

- సీఐకి వీఆర్‌తో సరి!
- సీఐ కుడిభుజం ఐడీ పార్టీ కానిస్టేబుల్‌పైనా చర్యల్లేవు
- ఏఆర్ నుంచి సివిల్‌కు కన్వర్టయిన నలుగురు సిబ్బంది సస్పెన్షన్
- బోరుగడ్డ అనిల్ కేసులో ఉన్నతాధికారుల వింత పోకడ



లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరు అరండల్ పేట పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్ బోరుగడ్డ అనిల్‌కు రాచమర్యాదలు చేసిన కేసులో పోలీసు ఉన్నతాధికారులు సమన్యాయం మరిచారు. కిందిస్థాయి సిబ్బందిని బలిచేశారు. అనిల్‌తో అరండల్‌పేట స్టేషన్ సీఐగా పనిచేసిన కె.శ్రీనివాసరావుకు తొలి నుంచి స్నేహసంబంధాలు ఉన్నట్టు విమర్శలు ఉన్నాయి. అందుకే ఆయన అనిల్‌ను నిందితుడిలా కాకుండా సాధారణ వ్యక్తిలా చూశారని, ఆయన ఆదేశాల మేరకే సిబ్బంది రాచమర్యాదలు చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో సీఐను వీఆర్‌కు పంపిన ఉన్నతాధికారులు ఏఆర్ నుంచి సివిల్‌కు కన్వర్టయిన నలుగురు సిబ్బందిని సస్పెండ్ చేశారు. సీఐకి కుడిభుజంగా వ్యవహరిస్తూ అనిల్ కేసులో కీలకంగా వ్యవహరించిన ఐడీపార్టీ కానిస్టేబుల్‌ను, స్టేషన్‌లోని డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను వదిలేయడం అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయం పోలీస్ శాఖలో చర్చనీయాంశమైంది.

ఐడీ పార్టీ కానిస్టేబుల్ హస్తం!

సీసీ ఫుటేజ్ బయటకు వచ్చిన కేసులో శేషు కాల్ డేటాను విశ్లేషించిన పోలీసులకు మరో విషయం తెలిసింది. సీఐ శ్రీనివాసరావుకు కుడిభుజంగా ఉండే ఓ ఐడీ పార్టీ కానిస్టేబుల్, ఓ డేటా ఎంట్రీ ఆపరేటర్ హస్తం కూడా ఉందని గుర్తించారు. ఐడీ పార్టీ కానిస్టేబుల్‌ను ఇటీవల జిల్లా ఉన్నతాధికారి వేరే స్టేషన్‌కు బదిలీ చేసినా సీఐతో ఉన్న సత్సంబంధాలతో అతను గుంటూరులోనే పనిచేస్తున్నట్టు తెలుస్తోంది. సెటిల్‌మెంట్లతోపాటు వ్యాపార సంస్థలు, బార్‌ల నుంచి డబ్బులు వసూలు చేసి సీఐకి ఇస్తుంటాడని ఆరోపణలు ఉన్నాయి. ఐడీపార్టీ కానిస్టేబుల్‌తోపాటు డేటా ఎంట్రీ ఆపరేటర్ బోరుగడ్డ వ్యవహారంలో సీఐ పట్ల, మరో సబ్ డివిజన్ అధికారి పట్ల ఇష్టం వచ్చినట్టు మాట్లాడినట్టు పోలీసు విచారణలో తేలడంతో ఉన్నతాధికారులు వారిని పిలిచి మందలించినట్లు సమాచారం. ఈ మొత్తం వ్యవహారంలో సీఐ, అతనికి కొమ్ముకాసిన వారిని నామమాత్రపు చర్యలతో వదిలేసి ఏఆర్ నుంచి సివిల్‌కు కన్వర్ట్ అయి రిటైర్‌మెంట్‌కు దగ్గరలో ఉన్న వారిని సస్పెండ్ చేయడంతో ఉన్నతాధికారుల తీరుపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కేసు ఇంకెన్ని మలుపులు తిరుగుతుందో వేచి చూడాలి.

సీసీ కెమెరాల టెక్నీషియన్ శేషు బ్లాక్‌మెయిలరే!

అనిల్ వీడియో బయటకు వచ్చిన వ్యవహారంలో అరెస్టయిన శేషుపైనా ఆరోపణలు వినిపిస్తున్నాయి. గుంటూరు అరండల్‌పేటకు చెందిన శేషు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే ఓ సంస్థలో టెక్నీషియన్. సంస్థకు వచ్చే ఆర్డర్ల మేరకు ఇళ్లు, ఆఫీసులు, బహిరంగ ప్రదేశాలు, ఫాంహౌస్‌లలో సీసీ కెమెరాలు బిగిస్తుంటాడు. అవి బిగించిన తర్వాత వాటి యాక్సెస్ పొంది యజమానులకు తెలియకుండా సీసీ ఫుటేజీల్లో రికార్డయ్యే దృశ్యాలను రహస్యంగా చూస్తుండేవాడని సమాచారం. ఈ ఫుటేజీలను అడ్డం పెట్టుకొని పలువురిని అతడు బెదిరించిన ఘటనలూ తాజాగా వెలుగులోకి వచ్చాయి. ఓ రిటైర్డ్ ఆర్ఎస్ఐ ఫాం హౌస్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన శేషు వాటి ఫుటేజ్‌లు రహస్యంగా చూశాడని పోలీసులు గుర్తించారు. మరో 11 చోట్ల సీసీ కెమెరాల యాక్సెస్ పొంది, ఆ దృశ్యాలనూ శేషు తన మొబైల్‌లో చూస్తున్నట్లు తెలుసుకున్నారు. శేషు ఓ టీవీ చానల్ కెమెరామెన్ వంశీ, ఓ పత్రికా విలేకరి అరుణ్‌తో కలిసి పలువురు బాధితులను బెదిరించినట్టు సమాచారం. దీంతో పోలీసులు ఈ ముగ్గురిపై రెండు కేసులు నమోదు చేశారు. శేషును మాత్రమే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అరుణ్ పరారీలో ఉండగా వంశీ మాత్రం అధికార పార్టీ నేతల అండతో స్టేషన్ బెయిల్ పొందాడు. పోలీసు విచారణలో పోలీస్ స్టేషన్ వీడియో తన వల్లే బయటకు వచ్చినట్టు శేషు వాంగ్మూలం ఇచ్చినట్టు సమాచారం. ఈ సీసీ ఫుటేజ్‌లను శేషు స్నేహితులూ చూసినట్టు సమాచారం.

వ్యక్తిత్వ వికాసానికి క్రీడలు దోహదం



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

- ఎన్జీ రంగా వర్సిటీ డీన్ కరుణాసాగర్
- అంతర కళాశాలల క్రీడా, సాంస్కృతిక పోటీలు ప్రారంభం



క్రీడలను ప్రారంభిస్తున్న డాక్టర్ జి. కరుణాసాగర్

బాపట్లటౌన్: వ్యక్తిత్వ వికాసానికి క్రీడలు దోహదపడుతాయని ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ జి.కరుణాసాగర్ తెలిపారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 2024–25 వార్షిక రెండో దశ అంతర కళాశాలల క్రీడా, సాంస్కృతిక, సాహిత్య పోటీలను ఆదివారం బాపట్ల వ్యవసాయ కళాశాలలో ప్రారంభించారు. కరుణాసాగర్ మాట్లాడుతూ క్రీడలను వర్సిటీ ప్రోత్సహిస్తోందని, వసతులు సమకూరుస్తోందని చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా డెప్యూటీ జనరల్ మేనేజర్ ఎస్.జవహర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ రవికాంత్ రెడ్డి, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ పి.ప్రసూనా రాణి, డాక్టర్ ఎన్.టి.ఆర్. కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అసోసియేట్ డీన్ ఎం.సర్దార్ బేగ్, కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజినీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డి.డి.స్మిత్ పాల్గొన్నారు.

వ్యక్తి కిడ్నాప్

- నగదు లావాదేవీలే కారణం
- గంటల వ్యవధిలోనే కిడ్నాపర్లను పట్టుకున్న పోలీసులు

చినగంజాం: నగదు లావాదేవీల విషయంలో కిడ్నాప్ అయిన ఓ వ్యక్తి ఆచూకీని పోలీసులు గంటల వ్యవధిలో గుర్తించారు. ఈ ఘటన చినగంజాం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. ఎస్సై శీలం రమేష్ కథనం ప్రకారం.. బేతాళవారిపాలెంకు చెందిన పిల్లి కృష్ణారావు, హైదరాబాద్‌కు చెందిన రియాజ్ స్నేహితులు. వీరిద్దరూ ఆన్‌లైన్ వ్యాపారం చేశారు. గతంలో రియాజ్ కొంత నగదును కృష్ణారావుకు ఇచ్చాడు. ఆ తర్వాత కృష్ణారావు స్వగ్రామానికి వచ్చి ఇక్కడే ఉండిపోయాడు. ఈక్రమంలో రియాజ్ హైదరాబాద్ నుంచి తన స్నేహితులను కొందరిని పంపాడు. ఆదివారం కృష్ణారావు తన ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో రెండు కార్లలో వచ్చిన కల్కి, ఆనంద్, నరేంద్ర రెడ్డి, ఉమేష్ రెడ్డి, సాయి, కిరణ్ తమను రియాజ్ పంపాడని, ఆన్‌లైన్ మార్కెటింగ్ నగదు లావాదేవీలపై మాట్లాడేందుకు తీసుకు రమ్మన్నాడని చెప్పి కృష్ణారావును భయపెట్టారు. బలవంతంగా అతని ల్యాప్‌టాప్, ఫోన్ తీసుకొని అతనిని కారులో ఎక్కించుకొని తీసుకెళ్లారు. కృష్ణారావు బంధువు బెజ్జం హరికృష్ణ ఫిర్యాదు చేయడంతో చినగంజాం పోలీసులు కేసు నమోదు చేశారు.

కారును వెంబడించి మరీ..!

కిడ్నాప్ కేసును కొద్ది గంటల్లోనే పోలీసులు ఛేదించారు. ఫిర్యాదిదారు హరికృష్ణ కిడ్నాపర్ల కారు వివరాలను తెలియజేయడంతో పోలీసుల బృందం వెంటనే రంగంలోకి దిగింది. పిడుగురాళ్ల టోల్‌ప్లాజా ద్వారా కారును కనుగొని వెంబడించి కిడ్నాపర్లు ఆరుగురిని పట్టుకొని అదుపులోకి తీసుకుంది. కిడ్నాప్ అయిన కృష్ణారావును విడిపించింది. అదుపులోనికి తీసుకున్న వ్యక్తులను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసు విషయంలో ఎస్ఐ శీలం రమేష్ చాకచక్యంగా వ్యవహరించారు.



సూర్యలంక తీరానికి తరలివచ్చిన సందర్శకులు

‘తీర’నాళ్ల

జనసంద్రం

- పోటెత్తిన సూర్యలంక తీరం
- లక్షమందికిపైగా భక్తులు, పర్యాటకులు
- కలిసొచ్చిన ఆదివారం
- వన సమారాధనలతో కళకళ

బాపట్లటౌన్: కార్తిక పౌర్ణమి తర్వాత వచ్చిన ఆదివారం కావడంతో సూర్యలంక తీరం భక్తులతో పోటెత్తింది. సుమారు లక్ష మందికిపైగా సందర్శకులు తరలివచ్చినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో తీరం తిరనాళ్లను తలపించింది. వన సమారాధనలతో కళకళలాడింది. తెల్లవారుజామునే భక్తులు, పర్యాటకులు సూర్యలంక తీరానికి చేరుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆహ్లాదంగా గడిపారు. కెరటాలపై కేరింతలు కొట్టారు. సూర్యనమస్కారాలు, పుణ్య స్నానాలతో భక్తిప్రపత్తులు చాటుకున్నారు. జిల్లాతోపాటు కృష్ణా, ప్రకాశం, హైదరాబాద్ నుంచి భారీగా పర్యాటకులు తరలివచ్చారు. మహిళలు తీరంలో ప్రత్యేక పూజలు చేశారు. ఇసుకతో గౌరీదేవి ప్రతిమ, శివలింగాలను తయారుచేసి వాటి ముందు ముగ్గులేసి ముగ్గుల మధ్యలో గొబ్బెమ్మలను పెట్టి పసుపు, కుంకుమలతో అలంకరించారు. పూజలనంతరం గౌరీదేవి ప్రతిమలతోపాటు గంగమ్మకు ఇష్టమైన పూలు, పండ్లు సముద్రంలో కలిపారు. సూర్యలంక సముద్రతీరానికి సమీపంలోని జీడిమామిడి తోటలు, ఇసుక తిన్నెలు వనభోజనాల సందడితో కళకళలాడాయి.

పోలీసులు సతమతం

కార్తిక పౌర్ణమికి అధిక రద్దీ ఉంటుందని భావించిన పోలీసులు ఆ రోజున 350 సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. అయితే ఆ రోజు వాయుగుండం ప్రభావంతో సందర్శకులు రాలేదు. ఆదివారం తీరంలో బందోబస్తుకు వంద మందిని మాత్రమే కేటాయించారు. పౌర్ణమి తర్వాత వచ్చిన ఆదివారం, సెలవు రోజు కావడంతో పొరుగు జిల్లాల నుంచీ భక్తులు భారీగా తరలిరావడంతో బందోబస్తు పోలీసులకు కష్టతరంగా మారింది. పర్యాటకులు సముద్రం లోపలకు వెళ్లడాన్ని నియంత్రించడం, ట్రాఫిక్ క్రమబద్ధీకరించడం, కట్టుదిట్ట భద్రతా చర్యలకు పోలీసులు శ్రమించాల్సి వచ్చింది. బాపట్ల రూరల్ సీఐ జి.గంగాధర్ ఉన్న సిబ్బందితోనే ప్రణాళికాబద్ధంగా బందోబస్తును నిర్వహించారు. అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.



సూర్యలంక తీరానికి తరలివచ్చిన వాహనాలు

నృత్య నూతనం

బాలోత్సవ్ భళ్లే.. భళ్లే

- వీవీఐటీలో ముగిసిన తెలుగు బాలల పండుగ
- ఆఖరి రోజూ అదరగొట్టిన విద్యార్థులు
- శాస్త్రీయ, జానపద నృత్యాలతో కళకళ



ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న విక్రాంత్



విద్యార్థినుల శాస్త్రీయ నృత్య విన్యాసం

పెదకాకాని: వీవీఐటీలో మూడు రోజులపాటు జరిగిన బాలోత్సవ్–2024 అట్టహాసంగా ముగిసింది. సమాజ హితం కోరేలా ఆద్యంతం సాగిన విద్యార్థుల ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. పెదకాకాని మండలం నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఆదివారం జరిగిన బాలోత్సవ్ ముగింపు ఉత్సవంలో ముఖ్య అతిథిగా నాగార్జున సిమెంట్స్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వాసిరెడ్డి విక్రాంత్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ భాష, సాహిత్యంపై పట్టు ఉంటే జీవితంలో విజయం సాధ్యమవుతుందని చెప్పారు. మన సంస్కృతిని, భాషను పరిరక్షించుకోవాలని సూచించారు. కళల్లో రాణిస్తే అవకాశాలు తలుపు తడతాయని చెప్పారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌కూ సృజనాత్మకత అవసరమని స్పష్టం చేశారు. గుంటూరు ఘనత తెలుపుతూ ఆయన పాడిన పద్యం ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది.

ఆఖరి రోజూ అట్టహాసంగా..

ఆఖరి రోజూ బాలోత్సవ్ అట్టహాసంగా జరిగింది. శాస్త్రీయ, జానపద బృందాలు నృత్యాలతో అలరించాయి. 52 జానపద బృందాలు 3 వేదికల వద్ద నృత్య జాతరను తలపించాయి. 36 శాస్త్రీయ నృత్య బృందాలు 2 వేదికలపై సత్తాచాటాయి. విచిత్ర వేషధారణలు తెలుగు సంస్కృతికి అద్దంపట్టాయి. మట్టి బొమ్మలు, కాగితపు చేతి బొమ్మల తయారీలోనూ చిన్నారులు ప్రతిభ కనబరిచారు.



సరస్వతీదేవికి నృత్య నీరాజనం

బాలోత్సవ్ విజయవంతం

కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ కళాశాల ఉపాధ్యాయులు ఉపాధ్యాయేతర సిబ్బంది సమష్టి కృషితో ఈ ఏడాది బాలోత్సవ్ జయప్రదమైందని ఆనందం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా 25,000 మంది ప్రేక్షకులు హాజరుకావడం గర్వకారణమన్నారు. అనంతరం 20 అంశాల్లో 61 విభాగాలుగా జరిగిన ఈ పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలతోపాటు రెండు ప్రత్యేక బహుమతులను ప్రదానం చేశారు.



శాస్త్రీయ నృత్య కళాకారిణులతో వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, అతిథులు



అఘోరాల వేషధారణలో నృత్యం చేస్తున్న విద్యార్థులు (అంతరచిత్రం) శివలింగంతో విద్యార్థిని ప్రదర్శన

క్లుప్తంగా

రేపు క్రోసూరులో జాబ్ మేళా



క్రోసూరు: డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్స్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ అధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్ సంయుక్తంగా జాబ్ మేళా నిర్వహించనున్నాయి. ఈ మేరకు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.తమ్మాజీరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రోసూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ఈ మేళా ఉంటుందని వివరించారు. వివరాలకు బి.అంజి రెడ్డిని 94949 86164 , ఇ.రామకృష్ణారెడ్డిని 80743 93466 నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యపై నివేదికకు ఆదేశం

నరసరావుపేట రూరల్: పట్టణంలోని ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై నివేదిక అందజేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి ఆదివారం ఆదేశించారు. పోలీస్, విద్యాశాఖ దర్యాప్తు చేసి నివేదికను సమర్పించాలని తెలిపారు. బాలిక తల్లిదండ్రులకు సానుభూతి తెలియజేశారు. ఇలాంటి ఘటనలు దురదృష్టకరమని పేర్కొన్నారు. పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వైద్యుడు మృతి



పిడుగురాళ్ల: రోడ్డు ప్రమాదంలో డాక్టర్ మృతి చెందిన సంఘటన పట్టణంలోని సూర్యాసెమ్ వద్ద ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. పిడుగురాళ్ల పట్టణానికి చెందిన సౌజన్య హాస్పటల్ డాక్టర్ కృష్ణంశెట్టి శ్రీధర్ దాచేపల్లి పట్టణంలో ఓ ప్రైవేటు వైద్యశాలలో ఆపరేషన్ నిర్వహించి తిరిగి పిడుగురాళ్ల వస్తున్నారు. సూర్యాసెమ్ వద్దకు రాగానే లారీ బయటకురావటంతో వెనుక నుంచి దానిని కారు ఢీకొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న శ్రీధర్ అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటనా స్థలాన్ని పిడుగురాళ్ల పట్టణ పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



ప్రమాదంలో ధ్వంసమైన కారు

ఆకట్టుకున్న కవి సమ్మేళనాలు



అద్దంకిలో మాట్లాడుతున్న రచయిత దివాకర దత్తు



చీరాలలో కవులను సత్కరిస్తున్న ముఖ్య అతిథులు

అద్దంకి: గ్రంథాలయమంటే ఎంతో పవిత్రమైనదని సృజన అధ్యక్షుడు, రచయిత గాడేపల్లి దివాకర దత్తు అన్నారు. ఆదివారం అద్దంకి శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల సందర్భంగా కవి సమ్మేళనాన్ని లైబ్రేరియన్ సుగుణరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. పుస్తకంతో మైత్రికి స్వాగతం పలికి సెల్ ఫోన్ చెర నుంచి విముక్తి పొందాలని కవులు అభిప్రాయపడ్డారు. కొల్లా భువనేశ్వరి, యనమండ్ర వరలక్ష్మి, పాలపర్తి జ్యోతిష్మతి, డాక్టర్ యు. దేవపాలన, ఆర్.రాఘవరెడ్డి, చందలూరి నారాయణరావు, ఇలపావులూరి శేషతల్పశాయి అంజాద్ బాషా, అనిల కుమారసూరి తమ కవితలను వినిపించారు. కార్యక్రమంలో సందిరెడ్డి శ్రీనివాసరావు, చప్పిడి వీరయ్య, అన్నమనేని వెంకట్రావు, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, మన్నం త్రిమూర్తులు, అద్దంకి దేవీప్రసాద్, పాటిబండ్ల శ్రీమన్నారాయణ, మారం కోటేశ్వరరావు, షేక్ మస్తాన్, పసుమర్తి కోటయ్య, కాకర్ల వెంకటేశ్వర్లు, మల్లాది శ్రీనివాసరావు, లక్ష్మీ రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

కవులకు సన్మానం..

చీరాల అర్బన్: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను స్థానిక శాఖా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం గ్రంథాలయంలో కవి సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు తమ కవిత్వాలతో ఆకట్టుకున్నారు. వడలి రాధాకృష్ణ, మంత్రి కృష్ణమోహన్, మేడబలిమి లూకా, పవని భానుచంద్రమూర్తి, సురేష్ చంద్రమూర్తి, కుర్రా రామారావు, ఆకురాతి ద్రాక్షాయినిలు వివిధ సామాజిక అంశాలపై కవితాగానం చేశారు. బాలలకు జనరల్ నాలెడ్జ్‌పై క్విజ్ పోటీలను నిర్వహించారు. క్విజ్ మాస్టర్‌గా పవని భానుచంద్రమూర్తి వ్యవహరించారు. అనంతరం కవులను గ్రంథపాలకురాలు డి.ధనమ్మ ఘనంగా సత్కరించారు.

ఐటీడీపీ పోస్టులపై ఫిర్యాదు



అరండల్‌పేట పీఎస్ ఏఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు ప్రేమ్‌కుమార్, కార్పొరేటర్ మల్లవరపు రమ్య తదితరులు

- మాజీ సీఎం జగన్‌పై అసభ్యకరంగా పోస్టులు పెట్టిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి
- అరండల్‌పేట, లాలాపేట పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేసిన వైఎస్సార్ సీపీ నాయకుడు ప్రేమ్‌కుమార్, కార్పొరేటర్ రమ్య

లక్ష్మీపురం(గుంటూరుపశ్చిమ): వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి భారతమ్మలపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన ఐటీడీపీ వారిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకుడు కొరిటిపాటి ప్రేమ్‌కుమార్ డిమాండ్‌చేశారు. గుంటూరు అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం 54వ డివిజన్ కార్పొరేటర్ మల్లవరపు రమ్య, పార్టీ లీగల్ సెల్ నాయకులు మొండితోక శ్రీనివాస్‌లతో కలిసి ఆయన ఫిర్యాదు చేశారు. ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ అసభ్యంగా పోస్టులు పెట్టిన ఐటీడీపీ సోషల్ మీడియాపై గుంటూరు లాలాపేట, అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చలేదని ప్రశ్నించిన వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలను అరెస్టులు చేసి, రిమాండ్‌కు పంపిస్తున్నారని, అయితే మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణిపై అసభ్యంగా పోస్టులు పెట్టిన ఐటీడీపీ కార్యకర్తలపై ఇంతవరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. పక్షపాతం లేకుండా ఐటీడీపీ సోషల్ మీడియా కార్యకర్తలను అరెస్ట్ చేయాలని, లేదంటే తాము రోడ్లపైకి వచ్చి పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా న్యాయవాది బలవన్మరణం

తెనాలిరూరల్: మహిళా న్యాయవాది బలవన్మరణానికి పాల్పడింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. తెనాలి పట్టణం శివాజీచౌక్ సమీపంలో నివసించే కాకుమాను కిరణ్మయి(40) జడ్జి పరీక్షలు రాసినా క్వాలిఫై కాలేదు. దీనికి తోడు కొన్ని అనారోగ్య సమస్యలు బాధిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అంత్యక్రియలకు ఏర్పాట్లు చేయగా సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం చేయించారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతాలు



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అన్నవరం ఆలయ వేదపండితులు



వ్రతంలో పాల్గొన్న దంపతులు

గుంటూరు రూరల్: కార్తిక మాసం పురస్కరించుకుని మండలంలోని గోరంట్ల గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం(పెద్దగుడి)లో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి ఉదయం ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలను నిర్వహించారు. స్వామివారికి వజ్రకిరీటంతో, బంగారు ఆభరణాలు అలంకరించి ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఆలయం ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో సుమారు 6 వేల మంది దంపతులతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. అన్నవరం ఆలయం వేదపండితులు, అర్చకులతో వేలాది మంది దంపతులు పీటలపై కూర్చుని ఉసిరిచెట్టు నీడల్లో సత్యనారాయణ స్వామి వ్రతాన్ని చేశారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదం అన్నదానం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కంచర్ల ఆంజనేయులు, అధ్యక్షుడు యర్రంశెట్టి వేణుగోపాల్, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, ప్రముఖ పారిశ్రామికవేత్త తులసీ ధర్మచరణ్, డేగల ప్రభాకర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కాలువలో పసికందు మృతదేహం



గుంటూరు రూరల్: అప్పుడే పుట్టిన బిడ్డను కాలువలో పడేసిన సంఘటన మండలంలో కలకలం రేపింది. నగర శివారులోని గుంటూరు-పొన్నూరు రహదారి బుడంపాడు కాలువ కల్వర్టు దగ్గరలో రోజుల వ్యవధిగల మగశిశువు మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారం మేరకు నల్లపాడు పోలీస్ స్టేషన్ పోలీసులు సంఘటన స్థలికి చేరుకున్నారు. శిశువు మృతదేహాన్ని రుద్రట్రస్ట్ సభ్యుల సహకారంతో జీజీహెచ్ మార్చురీకి తరలించారు. సంఘటనపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి శిశువు మృతదేహం నీటిలో కొట్టుకువచ్చిందా? లేక ఎవరైనా తెచ్చి ఇక్కడ పడవేశారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన జేఎన్‌టీయూకే కబడ్డీ పోటీలు

ఒంగోలు: జేఎన్‌టీయూ కాకినాడ ఆధ్వర్యంలో స్థానిక రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహిస్తున్న సెంట్రల్ జోన్ అంతర కళాశాలల మహిళా కబడ్డీ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో గుడ్లవల్లేరు ఎస్ఆర్‌జీఈసీ కాలేజీ - గుంటూరు సెయింట్ మేరీస్ జట్లు తలపడగా, ఉత్కంఠ పోరు సాగింది. ఈ మ్యాచ్‌లో గుడ్లవల్లేరు కాలేజీ టీం విజేతగా నిలిచింది. గుంటూరు సెయింట్ మేరీస్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేతలకు రైజ్ కృష్ణసాయి ప్రకాశం గ్రూప్ కాలేజీల కార్యదర్శి శిద్దా హనుమంతరావు, కోశాధికారి శిద్దా భరత్, రాగ చీఫ్ కో-ఆర్డినేటర్ శిద్దా ప్రవల్లిక, గౌరవ చైర్మన్ ఇస్కాల చినరంగమన్నార్, డైరెక్టర్ ఏవీ భాస్కరరావులు ట్రోఫీలు అందించారు. అనంతరం యూనివర్సిటీ జట్టును ఎంపిక చేశారు. ఎంపికైన యూనివర్సిటీ జట్టు ఈ నెల 26 నుంచి 30వ తేదీవరకు కేరళ రాష్ట్రం కొట్టాయంలో ఆడుతుందని ఫిజికల్ డైరెక్టర్ హేమచంద్ర తెలిపారు.

అ‘పూర్వం’.. ఆత్మీయం



నూతక్కి జడ్పీ హైస్కూల్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

- నూతక్కి జడ్పీ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం
- 31 సంవత్సరాల తర్వాత కలుసుకున్న మిత్రులు

మంగళగిరి: నగర పరిధిలోని నూతక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు దశాబ్దాల తర్వాత స్నేహితులంతా ఒక్కచోట కలుసుకున్నారు. జడ్పీ హైస్కూల్‌లో 1993–94 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఒక్కచోట కలుసుకుని సందడి చేశారు. మూడు దశాబ్దాల తర్వాత కలుసుకోవడంతో తమ పాఠశాల నాటి మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఒకరి నెంబర్లు ఒకరు మార్చుకుని, అప్పుడప్పుడు టచ్‌లో ఉండాలంటూ తీర్మానం చేసుకున్నారు. స్నేహితులంతా ఉత్సాహంగా రోజంతా గడిపారు. కార్యక్రమ నిర్వహణకు కృషి చేసిన శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాసరావులకు స్నేహితులంతా అభినందనలు తెలిపారు. ముఖ్య అతిథులుగా గణితం మాష్టారు భీమిరెడ్డి శివారెడ్డి, జొన్నల ప్రసాదరెడ్డిలు హాజరయ్యారు. విద్యార్థుల పాత చిత్రాలతో ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన నిమ్మగడ్డ సతీష్‌కు అభినందనలు తెలిపారు.

రేపు విశ్రాంత బ్యాంక్ ఉద్యోగుల ఫెడరేషన్ ధర్నా



మాట్లాడుతున్న మురళీకృష్ణారావు, వేదికపై హరిబాబు, కోటేశ్వరరావు తదితరులు

కొరిటెపాడు(గుంటూరు): యునైటెడ్ బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్, ఏపీ బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్ సంయుక్త పిలుపు మేరకు అనేక ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 19వ తేదీన విజయవాడలోని అలంకార్ కూడలి వద్ద రాష్ట్రస్థాయి మహాధర్నాను చేపట్టనున్నట్లు జిల్లా బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల కో-ఆర్డినేషన్ కమిటీ ప్రధాన కార్యదర్శి కేవీబీ మురళీకృష్ణారావు పేర్కొన్నారు. స్థానిక బ్రాడీపేటలోని బ్యాంక్ ఉద్యోగుల భవనంలో ఆదివారం జరిగిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుదీర్ఘ కాలంగా ఉన్న పెన్షన్ విధానాన్ని పునఃసమీక్షించాలని కోరారు. పెన్షన్ చెల్లింపుల్లో స్పెషల్ అలవెన్స్‌లను పరిగణలోకి తీసుకోవడంతో పాటు మెడికల్ ఇన్స్యూరెన్స్‌లో చెల్లిస్తున్న ప్రీమియంను తగ్గించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా తాము చెల్లించే ప్రీమియంలో బ్యాంక్ తన వాటాను చెల్లించాలని, పెన్షన్‌దారులు తీసుకున్న రుణాలు 10 ఏళ్లలోపు కట్టినా కానీ కోర్టుల ఆదేశాలను లెక్కచేయకుండా 15 ఏళ్ల వరకు రికవరీ చేయడం వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఇండియన్ బ్యాంక్ అసోసియేషన్ బ్యాంక్ ఉద్యోగులతో జరిపే చర్చలలో యునైటెడ్ బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్ సభ్యులను భాగస్వాములను చేయాలని సూచించారు. ఈ మహాధర్నా తర్వాత కూడా బ్యాంకుల యాజమాన్యాలు, ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేయనున్నట్లు ఆయన హెచ్చరించారు. సమావేశంలో ఫెడరేషన్ల నాయకులు కె.హరిబాబు, వై.కోటేశ్వరరావు, శ్యామ్, వై.హనుమంతరావు, పుల్లయ్య, వెంకయ్య, శివాజీ, విజయ ప్రకాష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పోటీల్లో చీరాల క్రీడాకారుల సత్తా



షాట్‌పుట్‌లో బంగారు పతకం అందుకున్న హెడ్ కానిస్టేబుల్ నాగరాజు



పరుగు పందెంలో బంగారు పతకాలు సాధించిన కూలీ సాంబశివరావు

మాస్టర్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ చాటిన ఆటగాళ్లు

చీరాల రూరల్: ప్రపంచస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో చీరాలకు చెందిన ఇరువురు క్రీడాకారులు సత్తా చాటారు. ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు పశ్చిమ బెంగాల్‌లో అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. చీరాల టూటౌన్ పోలీసు స్టేషన్‌లో స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ నాగరాజు ఈ పోటీల్లో 40 ప్లస్ విభాగంలో షాట్‌పుట్ ఆటలో తలపడ్డారు. ఏకంగా బంగారు పతకం కైవసం చేసుకున్నారు. జావెలిన్ త్రోలో సిల్వర్ మెడల్ కూడా సాధించారు. నాగరాజును పోలీసులతోపాటు క్రీడాభిమానులు అభినందించారు.

ఈపురుపాలెం సిండికేట్ వీవర్స్ కాలనీకి చెందిన అడిగోపుల సాంబశివరావు రోజువారి కూలీ. క్రీడలపై మక్కువతో పరుగు ప్రతిరోజు సాధన చేస్తున్నారు. 45 ప్లస్ విభాగంలో 100, 200 మీటర్ల విభాగాల్లో బంగారు పతకాలు సాధించారు. 5 దేశాలకు చెందిన క్రీడాకారులు పోటీల్లో తలపడ్డారు. సాంబశివరావును పలువురు అభినందించారు.

వీఆర్ఏల ముందస్తు అరెస్టు, నిర్బంధాలు అక్రమం

సీఐటీయూ పల్నాడు జిల్లా కమిటీ అధ్యక్షుడు



వీఆర్ఏల సంఘ జిల్లా అధ్యక్షులు షేక్ బందగీ సాహెబ్‌కు ముందస్తు నోటీసు ఇస్తున్న పోలీసు


నరసరావుపేట: తమ సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా రాష్ట్రవ్యాప్త నిరసన చేపట్టాలని భావించిన గ్రామ రెవెన్యూ సహాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం, గృహనిర్బంధానికి గురిచేయటం అక్రమమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని సీఐటీయూ పల్నాడు జిల్లా కమిటీ అధ్యక్షులు ఎస్.ఆంజనేయులు నాయక్ ప్రకటించారు. తాము ప్రజాస్వామ్యయుతంగా పాలిస్తామని కూటమి సర్కారు ప్రకటించిందని, నేడు దానికి భిన్నంగా వ్యవహరిస్తోందన్నారు. వీఆర్ఏల ఏ ఒక్క సమస్యనూ సర్కారు వచ్చాక పరిష్కరించలేదని తెలిపారు. వారి సర్వీసు నిబంధనలకు విరుద్ధంగా గతంలో లేని విధానంలో ఆఫీసులలో నైట్ డ్యూటీలు చేయిస్తున్నారని మండిపడ్డారు. ఇసుక రీచ్‌ల వద్ద కాపలాదారులుగా పెట్టారన్నారు. ప్రమోషన్లు కూడా ఇవ్వకుండా ఇతర పనులను అదనంగా చేయిస్తున్నారని తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు, రెవెన్యూ మంత్రి, ముఖ్యమంత్రికి వినతి పత్రాలు ఇచ్చినా అతీగతీ లేదని చెప్పారు. ఈ నేపథ్యంలో నవంబర్ 18వ తేదీన రాష్ట్రవ్యాప్త శాంతియుత నిరసనకు పూనుకున్నామని పేర్కొన్నారు. అణచివేత చర్యలకు పూనుకోవడం ద్వారా ప్రభుత్వం నిరంకుశ విధానాన్ని చాటుకుందని తెలిపారు. దీనివల్ల ఉద్యమాలు నిలిచిపోవని స్పష్టం చేశారు. వీఆర్ఏల సంఘం నాయకులతో చర్చలు జరిపి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు బహిరంగ వేలం

నెహ్రూనగర్: గుంటూరు నల్లపాడు ఐఎంఎఫ్ఎల్ డిపో సమీపంలోని గోడౌన్‌లో వివిధ ప్రభుత్వ మద్యం దుకాణాలకు సంబంధించిన వస్తువులను సోమవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ వై.శ్రీలత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వేలంలో ప్రభుత్వ దుకాణాల్లో ఉన్నటువంటి 103 ఫ్రీజర్లు, 84 ఇన్వర్టర్లు, బ్యాటరీలు, 96 క్యాష్ చేస్ట్‌లు, 405 స్కానర్లు, 122 క్యాష్ కౌంటింగ్ మెషీన్లను వేలం వేయనున్నట్లు చెప్పారు. ఇతర వివరాలకు 9949351046, 7989704893 నంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

108లోనే ప్రసవం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పెనుమూలి గ్రామంలో 108 అంబులెన్స్‌లో ఓ మహిళ పండంటి శిశువుకు ఆదివారం తెల్లవారుజామున జన్మనిచ్చింది. 108 పైలెట్ ప్రసాద్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం పెనుమూలికి చెందిన నాగదుర్గకు పురిటి నొప్పులు వచ్చాయని కుటుంబ సభ్యులు సమాచారం ఇచ్చారని, 108లో ఆసుపత్రికి తరలిస్తుండగా నొప్పులు ఎక్కువకావడంతో కాన్పు చేశామన్నారు. నాగదుర్గ మగబిడ్డ పుట్టాడని, పేగు మెడలో వేసుకుని జన్మించడంతో మెరుగైన వైద్య నిమిత్తం తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఆయన తెలిపారు. కాన్పు నిర్వహించిన వారిలో ఎమర్జెన్సీ టెక్నీషియన్ ఆనంద్, ఆశా కార్యకర్త ఫాతిమాలు ఉన్నారు.



రెండు బైకులు ఢీ.. వ్యక్తి మృత్యువాత


మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



మస్తాన్‌వలి (ఫైల్)

మాచవరం: మండలంలోని తురకపాలెం గ్రామ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న దుర్ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందగా, ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం రాత్రి జరిగింది. వివరాల ప్రకారం.. తురకపాలెం గ్రామానికి చెందిన షేక్ మస్తాన్ వలి (25), దరియా వలి ద్విచక్ర వాహనంపై స్వగ్రామం నుంచి మాచవరం వెళుతున్నారు. మాచవరం నుంచి వేమవరం వైపు వస్తున్న ద్విచక్ర వాహనం బలంగా ఢీకొంది. ఘటనా స్థలంలోనే మస్తాన్ వలి మృతి చెందాడు. దరియావలికి, మరో బైకుపై వచ్చిన పిన్నెల్లి గ్రామానికి చెందిన శ్రీనుకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108లో చికిత్స నిమిత్తం పిడుగురాళ్ల ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ సతీష్ పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కాలువలో ఇంజినీరింగ్ విద్యార్థి గల్లంతు



మౌనిష్‌కుమార్ (ఫైల్)

మాచర్ల రూరల్: స్నేహితులతో కలిసి సరదాగా ఈతకు వెళ్లి నీటి ప్రవాహంలో ఇంజినీరింగ్ విద్యార్థి గల్లంతయ్యాడు. ఈ సంఘటన పట్టణ శివారులోని నాగార్జునసాగర్ కుడి కాలువలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మండలంలో ఉన్న ఓ ప్రైవేటు ఇంజినీరింగు కళాశాలలో బీటెక్ సీఎస్ఈ ఫస్ట్ ఇయర్ చదువుతున్న ఏలూరు జిల్లాకి చెందిన విద్యార్థి కొడమంచిలి మౌనిష్ కుమార్ (18) ఆదివారం మధ్యాహ్నం ఇద్దరు స్నేహితులతో కలిసి పట్టణ శివారులో ఉన్న నాగార్జునసాగర్ కుడి కాలవలో ఈతకు వెళ్లాడు. నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో కొట్టుకుపోయాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డీఎస్సీ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన

తెనాలి: బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత గుంటూరు బీసీ స్టడీ సర్కిల్‌లో ప్రారంభించిన డీఎస్సీ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ఒక ప్రకటనలో సూచించారు. సంఘం తరఫున 26 జిల్లాల్లోని బీసీ స్టడీ సర్కిళ్లలో అన్ని రకాల ఉద్యోగార్థులకు ఉచిత శిక్షణను ఇవ్వాలని, రాజధాని అమరావతిలో సివిల్స్ కోచింగ్ సెంటర్ ప్రారంభించాలని కోరినట్టు గుర్తుచేశారు. తమ విజ్ఞాపన మేరకు తొలిగా 100 మందికి సివిల్స్ కోచింగ్ ఇస్తామని మంత్రి హామీనివ్వటం సంతోషంగా ఉందన్నారు. ప్రతి జిల్లా నుంచి 250 మంది చొప్పున 5,720 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులకు 60 రోజుల పాటు డీఎస్సీ శిక్షణ ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని పేద, బడుగు వర్గాలకు చెందిన నిరుద్యోగ యువత సక్రమంగా వినియోగించుకొని, తమ కలల్ని సాకారం చేసుకోవాలని శంకరరావు విజ్ఞప్తి చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

■ వినుకొండ మున్సిపాలిటీ దగ్గరలో తక్షణమే గృహ నిర్మాణానికి అనువైన 100 గజాల ప్లాట్స్ (2 సెంట్స్) కేవలం రూ.1,50,000/- (లక్షా యాభై వేలు) మాత్రమే. స్పాట్ రిజిస్ట్రేషన్ మరియు సులభ వాయిదాల పద్ధతి కలదు. 8609997999

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 91699 22299

■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 88024 89999

WANTED

■ శ్రీలక్ష్మీ హోంకేర్ Hyd నందు వృద్ధులకు, పేషెంట్లకు సేవ చేయుటకు లేడీ టెలికాలర్స్, బేబీ కేర్,ఇంటి/వంటపనికి స్త్రీ/పు॥ కా॥ జీ॥ 17000/- 25000 రూం+ మీల్స్ ఫ్రీ ✆ 93471 48051

■ నూతనంగా ప్రారంభించిన బ్యాంక్ అనుబంధ సంస్థ నందు పనిచేయుటకు VRS, Rtd, వ్యాపారస్తులు, హౌస్‌వైఫ్స్ కావలెను. జీ+ESI+PF+ ఇన్సెంటివ్స్ -75000/- ✆7013481406

■ చిలకలూరిపేటలోని నేత్ర ఐ కేర్ నందు పనిచేయుటకు (Optometrist (or) Refractionist) ఆప్టోమెట్రిస్ట్, రిఫ్రాక్షనిస్ట్ కావలెను. సంప్ర॥ 8179659495, 9885388684

■ ప్రముఖ సంస్థ గుంటూరు నందు పనిచేయుటకు మంచి విశ్వాసులు డ్రైవర్లు, టెలికాలర్లు, ఆఫీస్ స్టాఫ్, సూపర్‌వైజర్స్, మార్కెటింగ్ ఆఫీసర్లు కావలెను. మంచిజీతం. 63051 22366

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818882.

■ ఒక ప్రముఖ రెసిడెన్షియల్ కాలేజి వారి మెస్‌లో పనిచేయుటకు వర్కర్స్ కావలెను. టిఫిన్ మాస్టరు, గ్రైండర్ వేసేవాళ్ళు, కూరగాయలు కోసేవారు కావలెను. కనీసం వయస్సు 40 సంవత్సరాలు లోపు ఉండవలెను. సెలెక్ట్ అయిన వారికి భోజనం మరియు వసతి కల్పించబడును. పనిచేయు స్థలం: గుంటూరు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 89784 80429/35

■ ప్రముఖ కంపెనీ నందు వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul: 10th- డిగ్రీ Sal: 20k-25k, ఉచిత రూము భోజనం సదుపాయం, వర్క్ ఫ్రం హోం అవకాశముంది. Cont: 9110256233

■ తెనాలి కృష్ణ చికెన్ పౌల్ట్రీలో పనిచేయుటకు క్యాషియర్లు,హెవీ లైసెన్స్ కలిగిన డ్రైవర్లు & కలెక్షన్ చేయుటకు స్టాఫ్ కావలెను. జీతం 15k-20k చినరావూరితోట. 9052290512

■ నల్లపాడు సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ దగ్గర డాక్యుమెంట్ రైటర్ వద్ద తెలుగు, ఇంగ్లీష్ వచ్చిన DTP ఆపరేటర్ M/F కావలెను. మంచిజీతం. సంప్ర॥ 9440260482

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 18K. Ph: 9160900024, 9640400073

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ఎడిషన్ రూ.475/- మాత్రమే
ప్రతి అదనపు లైను రూ.100 మాత్రమే
గుంటూరు
7075167541
7075167663